# ఎక్స్చేంజ్



"ఒరేయ్... నువ్వు ఈ సాయంత్రం మాయింటికి రావాలిరా!" అంటూ వచ్చాడు మూర్తి.

"ఎందుకూ... మీ ఇంట్లో ఏమైనా పేరంటమా?" అన్నాడు శంకర్ నవ్వుతూ.

"ఏం- పేరంటం మీద మనసు పోతోంది... మగవాడివి కాస్తా మగువవుతున్నవా ఏమిటి?" అన్నాడు మూర్తి నవ్వుతూ.

"నలుగురు బిడ్డల తండ్రినయ్యాక- ఇపుడు మారినా పర్వాలేదులే కాని, సంగతేమిటో చెప్పు."

"మరేం లేదు. నా కొత్త టెలివిజన్‌ని చూద్దువుగాని!"

"కొత్తదా? మొన్నామధ్య చూపించావుగా! మా అందరికీ పార్టీ కూడా ఇచ్చావు."

"అది అంత బాగాలేదు. అందువల్ల దాని ఎక్ఛేంజి చేశాను. నిన్ననే వచ్చింది."

"టెలివిజన్ ఎక్ఛేంజా! అవున్లే... ఎంతైనా కమర్షియల్ టాక్స్ ఆఫీసరవి. నువ్వు అడిగితే కాదనగలరా?"

"అక్కడికి నువ్వు తక్కువైనట్లు- నువ్వూ ఎక్సయిజ్ సూపరింటెండెంట్ వేగా!"

సరదాగా జోక్స్ వేసుకుంటూ మిత్రులిద్దరూ మూర్తి ఇంటికి చేరారు.

"ఇదిగో చూడు... ఎంత బాగుందో! కావాలంటే మాత్రం- ఇటువంటిది దొరుకుతుందా?" అంటూ తన కొత్త టెలివిజన్ చూపించాడు మూర్తి.

ఆ టెలివిజన్ చూడగానే శంకర్ గుండె ఝల్లుమంది.

అది అంతకుముందు తాను కొన్నదానిలాగే ఉంది. దగ్గరకు వెళ్లి- తలుపులూ అవీ తీసి పరీక్షగా చాసిస్ నంబరూ అవీ చూశాడు.

సందేహం లేదు. అది మొదట తాను కొని, బాగాలేదని ఇచ్చేసి మరొకదానితో ఎక్ఛేంజి చేసినట్టిదే! ఈ లెక్కన తాను ఎక్ఛేంజి తీసుకున్నది ఇంకెవరికైనా నచ్చక వదిలేసినదేమో! అని అనిపించింది అతనికి.

"ఎలా ఉంది కొత్త సెట్టు? బ్రహ్మాండంగా ఉందికదూ?" అని మూర్తి అడుగుతుంటే, పచ్చి వెలక్కాయ గొంతులో పడ్డట్లయింది శంకర్‌కి.

– పల్లకి వార పత్రిక... *26 జూలై 84*

## అందాకా ఎందుకు..?



పరంధామయ్యగారు అద్దె డబ్బులు వసూలు చేసుకోడానికి వచ్చారు. ఊహాలోకంలో విహరిస్తున్న కళాసాగర్- "కొంతకాలం తర్వాత ప్రజలు 'ఈ గదిలో ప్రఖ్యాత చిత్రకారుడు కళాసాగర్ అద్దెకుండేవాడు' అని చెప్పుకుంటారు!" అన్నాడు ఎటోచూస్తూ.

"అందాకా ఎందుకూ.. రేపటిలోగా నీ అద్దె బాకీలు రాకపోతే ఎల్లుండి నుంచే చెప్పుకుంటారు!" అన్నాడు పరంధామయ్య పళ్లు నూరుతూ.